చింతలపూడివారి సంభావన

బొడ్డపాటి సీతాబాయిగారు

అమృతరావు పేరు వినని వారెవ్వరూ బెజవాడలో లేరు. ఎందుచేతంటే సంఘసంస్కారులలో మొదటిపేరీయనది. దానధర్మాలు—అంటే చందాలు మొదలగువాటిలో పెద్దమొత్తంగల పేర్లల్లో వుంటుంది అమృతరావు పేరు. వీటి అన్నిటికీ మించినది ఉద్యోగపు పలుకుబడి. డిస్ట్రిక్టుకలెక్టరంటే సామాన్యమా? ఈయన ఇపుడు బెజవాడలో డిస్ట్రిక్టుకలెక్టరు చేయుచున్నాడు. ఈవూరిలో ఆంధ్రవిశ్వవిద్యాలయం అదీ వుందనీ, నాలుగురైళ్ళకీ కూడికయనీ ఇక్కడే స్థిరపడుటకు నిశ్చయించుకొని ఈయన గవర్నరుపేటలో పెద్దబంగాళాకట్టుకుని ఉన్నాడు. భార్యపేరు విమల. ఈమె మొదట భర్తగారితో ఏకీభవించకపోయినా, అతిబాల్యవివాహములవల్ల గలుగు అనర్థకములు, దినదినాభివృద్ధి పొందుచున్న బాలవితంతువుల సంఖ్యాభివృద్ధి మనస్సున నాటునట్లు భర్త బోధించగా ఏమైనా సరే యుక్తవయస్సు రాకుండా ప్రేమకు పెండ్లి చేయరాదనుకునేది. మాణిక్యమ్మ పూర్వోత్తరపు మనిషి. ఆమె కీనవీనాచారాలూ, కొమారుని పూర్వాచారఖండనోపన్యాసాలూ అవీ అంటే అదోమోస్తరుగా వుండేది. పాపం! ఏంజేస్తుంది? ఒక్కడే కుమారుడూ, వృద్ధాప్యము, వినిపించుకోనట్లు వూరుకునేది. అమృతరావు కొమార్తెకు అయిదవయేటనే అక్షరాభ్యాసముచేసి కాన్వెంటుస్కూలుకు పంపించాడు. ప్రేమకిప్పుడు పదియవయేడు. సెకండుస్టాండర్డు చదువుచున్నది ఇంగ్లీషుచక్కగా మాట్లాడగలదు. వూలుకుట్టు మొదలగునవి బాగావచ్చును. కొద్దిగా తండ్రిపోలిక. వాళ్ల బామ్మ 'నాతల్లికి శాస్త్రాల్లో చెప్పినట్లు ఎక్కడవుండే అందం అక్కడవుంది. అదృష్టవంతురాలు. జమిందారుణ్ణి పెళ్లాడుతుం'దని ముద్దులాడేది. కొమారునిమాటలు జ్ఞాపకము వచ్చినప్పుడల్లా "ఏమే ప్రేమా, డాక్టరువు అవుతావుటే; మాకందరికీ మందు లిస్తావమ్మా; డాక్టరీ అయితే బాగానేవుంటుంది. సుబ్బరంగా ఆడవాళ్లకి ఆపత్కాలమందు పురుషుల సంపర్కం లేకుండా పురుడూ, పుణ్యమూ చూడొచ్చు. ఏమో నేను పెద్దదాన్నైనాను; ప్రేమ పెండ్లి కూతురౌతే చూడాలని వుంది." అనేది. 'అమృతరావుగారికి సంఘసంస్కారాలంటే చాలా అభిమాన'మనీ, 'అభిమానమే కాకుండా కూతురికి పెండ్లి చేయకుండా డాక్టరీ చదివించుతాడట. చాలామంది ఈలా చెప్పినవారే తీరా సమయం వస్తే పదేండ్లయినా నిండకుండా పెళ్లి చేస్తారు చూద్దాంగదా'అని వూళ్ళోవారంతా అనుకునేవారు. ఏపదిమంది ఒకచోట కూడినా అమృతరావు ప్రస్తాపనే. ఆయన హోదా, సంఘసంస్కరణాభిమానమూ, దాతృత్వమూ, మొదలగునవి వర్ణించేవారూ రసించేవారూ, ఖండించేవారూ, తటస్తంగా వూరుకొనేవారూ ఈప్రకారంగా నాలుగు భాగాలయ్యేవారు. ఇది ఈలావుండగా ఒకరోజు మామూలు ప్రకారం అమృతరావు కాఫీపుచ్చుకొని, సొంతంగా క్షౌరంచేసుకొని చాకలి అచ్చన్న 'స్నానానికి నీళ్లు తోడానండి బాబూ' అని చెప్పగా, స్నానంచేసి కుర్చీలోకూర్చుని వార్తాపత్రికలు తిరుగవేయ మొదలిడెను. ఇంతలో డఫేదారు టపా తేగా పుచ్చుకొని ఒకటొకటే చింపిచూచెను. అందులో ఒకకవరు 'అమృతరావుగారు, డిస్ట్రిక్టుకలెక్టరు, బెజవాడ.'అని యుండగా నిదానించిచూచి దానిని కూడా విప్పి చదివెను. అందిట్లున్నది:

"బి. అమృతరావుగారికి,

నిన్ను కాకినాడకు ప్రెజరీ డిస్ట్రిక్టుకలెక్టరుగా ట్రాన్స్ఫరు చేయడమైనది; గనుక ఈనెలాఖరున కాకినాడలో రంగయ్యనాయడుగారినుండి ఛార్జి పుచ్చుకోవలెను."

అని కృష్ణజిల్లా కలెక్టరుగారగు హెచ్ జాన్సనుదొరగారిద్వారా వచ్చిన ఈబదిలీ ఆజ్ఞాపత్రము చూచుటతోనే అమృతరావొకవిధమైన ఆశ్చర్యవిచారములకు లోనయ్యెను. ఆంధ్రవిశ్వవిద్యాలయము బెజవాడలో పెట్టెదరని విన్నప్పటినుండి ఆంధ్రుడౌటచే ఇక్కడ స్థిరనివాసమునకు వసతు లేర్పర్చుకోవలెనని విశ్వప్రయత్నములుచేసి ఇక్కడికి రాగలిగెను. వచ్చినట్టుగానే మంచిస్థలము

కొని పెద్దబంగాళాకట్టి అందులో గృహప్రవేశమయ్యెను. ఇంటిలో ఇంకనూ స్థిరపడనైనా లేదు. ఏవిశ్వవిద్యాలయపు ఆశపెట్టుకొని బెజవాడలో వుండ నిశ్చయించుకొని పాతికవేలు ఖర్చుపరిచి ఇల్లుకట్టెనో ఆవిశ్వవిద్యాలయము బహునాయకత్వము వలననూ, ఐకమత్యము లేమిచేతనూ దానిసూత్రము పట్టుకుని నలుగురూ నాలుగుప్రక్కలకీ లాగగా ఆసూత్రము కాస్తా తెగి ఆలయ మనంతపురికి గాలిచే ఎగిరిపోనున్నది. ఈసంగతి తెలియగానే అమృతరావు మనస్సు నిరుత్సాహము పొందెను. శాసనసభలో ఏమైనా 'ఇక్కడనుండి కదుపరా' దందురేమో అని ఆశించెను. ఆ ఆశ ఇంతవేగిరము తీరునట్లు లేదు. కొందరు సభ్యులు నాలుగుప్రదేశములూ చూచి ఇక్కడ వుంచుటకో, లేక ఎక్కడికైనా మార్చుటకో అప్పుడు నిశ్చయించెదరట. 'రెడ్డొచ్చె మొదలిడు' మనునట్లు మొదటికి వచ్చినది.

ఈసంగతి మొదలే తెలిస్తే ఇక్కడ స్థిరపడకే పోవుదునని ఒకమాటూ, పోనీ విశ్వవిద్యాలయ మెట్లు శంకుస్థాపనచేసి ఇంకోవూరికి మోసికొనపోవుదురో నేనూ అల్లే నాబంగాళా మొదలగువాటిని మార్తునా అంటే ఐరోపాలోవలె ఇండ్లను త్రిప్పెడియంత్రము లిక్కడ లేవేమని ఒకమాటు ఈలా డోలాందోళిత మనస్కుడై యున్న సమయములో పులిమీదపుట్రవలె సంవత్సరమైనా క్రొత్తయింటిలో వుండకుండా బదిలీఅయిందనే విచారముతో, ఇక్కడికివచ్చి ఏడాదైనా కాలేదే? అప్పుడే బదిలీయా? అనే ఆశ్చర్యముతో కొంతసే పూరకే కూర్చుని గడియారము పదకొండు కొట్టగా టపా దఫేదారుని సద్దమని, బదిలీకాగితము పుచ్చుకుని లోపలికి వెళ్లి తల్లికీ, భార్యకీ ఈసంగతి చెప్పేడు. వారున్నూ మతిపోయినట్లయి, 'ఎక్కడికాకినాడ? ఎక్కడి బెజవాడ? ఎక్కడి కేదరి. ఇప్పుడేగా ఇక్కడికి మార్చారూ? ఇంతట్లోకే మళ్లీ మార్చా? ఎవరు కట్టగలరీ ప్రయాణపు సామానులు? ఏది లేకపోయినా జరగదాయె! అన్నీ పట్టుకువెళ్లాలి. క్రొత్తఇంటిలో ఎవరినేనా కాపురముంచుతే పాడుచేస్తారు. తాళం పెడితే జాగ్రత్తలేదు. మొక్కలన్నీ ఎండిపోతాయి. పశువులుకూడా కొంటిమి. వాటినేమిచేయుట? అయ్యో! ఈపాడుబదిలీ ఇప్పుడే రావాలీ' అని ఏదో దేశాంతరపు బదిలీలాగ బెంగతో మాటలమీద మాటలు అత్తాకోడలూ చెప్పుతూంటే అమృతరావు కేమీ తోచక కొంతసే పాలోచించి 'కచేరీకి టైమవుతూం'దను కొనుచూ వీరిమాటలు వినుచూ పడకటింటిదగ్గఅనుంచున్న వంటబ్రాహ్మణునితో 'రామయ్యా వేళవుతోంది వడ్డించమూ' అన్నాడు. వెంటనే అరిటాకులో వండినవన్నీ వడ్డించి వంటింటిగుమ్మంలో నుంచున్న రామయ్యను చూచి 'రామయ్యా, ఈవాళ వంటేమీ బాగుండ లేదోయి' అన్నాడు. 'నిత్యం, నేను రోజులాగే వండానండి, ఎందుకు బాగులేదో బాబూ' అంటూ మజ్జిగ వడ్డించాడు. భోజనముచేసి అమృతరావు హాల్లోకివచ్చి భార్య ఇచ్చిన తాంబూలము పుచ్చుకొని కచేరీబట్టలు ధరించుచుండగా, మాణిక్యంబ వచ్చి "అయితే అమృతూ, వెళ్లక తప్పదుట్రా; పోనీ సెలవుపెడుదూ; శుభంగా ఇంట్లో వుందాం. కొంతకాలం" అం-. ఇంతలో కేకాన్వెంటుస్కూలునుండి పన్నెండు గంటలైనందున ప్రేమ ఇంటికి వచ్చి తల్లి, తండ్రి, బామ్మముఖములయందు మార్పున్ను వారిమాటలున్నూ గ్రహించి "రామయ్యా, ఏం మాట్లాడుకుంటున్నా"రని అన్నం తినకుండా అడిగింది. "నాన్నగారికి కాకినాడ బదిలీ అయింది. ఇల్లూ వాకిలీ వదలి ఏలారా అని అనుకుంటున్నారు. నువ్వన్నం తిను ప్రేమమ్మ" అన్నాడు రామయ్య. "అబ్బా వుండు రామయ్యా"అని తండ్రిదగ్గరకి పరుగెత్తి "నాన్నగారూ మీకిష్టముంటే కాకినాడ వెళ్ళండి. నేమట్టుకు రాను, బాబూ. నాకు పరీక్షలొస్తున్నాయి. అక్కడ ఈలాంటి కాన్వెంటూ, ఇంతమంచి సిసటర్లూ, మదరూ దొరకుతారా ఏమిటి?" అని మూతి ముడుచుకుంది. "నీకిక్కడే వుండాలని వుందా. అయితే నువ్విక్కడే వుందూగాని లే అమ్మ, అన్నంతిన్నావా" అన్నాడు తండ్రి. "వెళ్లవే, మేంగూడా వస్తాంపద" అన్నారు తల్లి బామ్మా. "మీరింకా భోంచెయ్యలేదూ వెళ్లండి. రాత్రి ఆలోచిద్దాం నాకూ వేళవుతూం"దని తొందరగా అమృతరా వాఫీసుకి వెళ్లిపోయాడు. విమలా, మాణిక్యమ్మ, ప్రేమా భోంచేస్తూ బదిలీనిగురించే మాట్లాడుకుంటూ అర్థాకలిగా లేచారు.

సాయంకాలము అమృతరావింటి కెప్పుడు వస్తాడా అని అత్తాకోడలూ కనుపెట్టుకుని వున్నారు. అయిదుగంటలకు రావలసిన అమృతరావు ఆరుగంటల కింటికి వచ్చి కచేరీబట్టలు మార్చుకొని అవశిష్టా లన్నీ తీర్చుకొని హాల్లోకివచ్చి కూర్చున్నాడు. ఇంతలో ప్రేమవచ్చి "నాన్నగారూ, ఇంగ్లీషులో నేనేఫస్టు పదింటికీపదిమార్కులండీ; నిట్టింగులో నే ఎక్సలెంటూ; అన్ని సబ్జక్టుల్లోనూ ఈవాళ నేనే ఫస్టు! నాన్నగారూ" అని చెప్పింది. "అన్ని సబ్జక్టుల్లోనూ నువ్వే ఫస్టుటే! మా బాగా వస్తున్నాయే, ప్రేమా, మార్కులూ!" అన్నాడు తండ్రి. ఆమాటలకు పొంగిపోతూ హాల్లో ఉత్తరపుమూలనున్న బొమ్మరింట్లో కూచుని ఆడుకుంటూంది ప్రేమ. గృహప్రవేశమునాటికే బొమ్మరిల్లు కట్టించుకుని తండ్రితోకూడా తాను బొమ్మరింట్లో గృహప్రవేశ మయింది. కూతు రెంతచెపితే అంతే అమృతరావుకు. ఎప్పుడేది కావాలంటే అది తప్పకుండా తెప్పించేవాడు. అందుచేతనే కచ్చేరీ సావిట్లోనే నాబొమ్మరిల్లుండాలంటే సరేనని కట్టించాడు. మాణిక్యమ్మ వచ్చి అయితే "అమృతూ, బదిలీనిగురించి ఏమాలోచించా"వంది. "ఇంక ఆలోచించుట కేమీ లేదు. తప్పక వెళ్లవలెను. కలక్టరుగారిద్వారా పట్నమునకు జవాబుకు సొమ్ముకట్టి టెలిగ్రామిచ్చాను. వెళ్లితీరవలెనని బదులు వచ్చినది." "పోనీ అబ్బాయీ, సెలవు పెట్టకూడదుట్రా" అంది. "వీలులేదు. మొన్ననేగా నాకున్న సెలవంతా పుచ్చుకున్నానమ్మా! ఇంక హక్కులేదు. జీతంనష్టంమీద పుచ్చుకోవాలి. నాకు చార్జి వప్పగించి వెళ్లిన డిప్టీ కలెక్టరు ఆనందరావుకికూడా ఇక్కడ ఇల్లు కట్టుకున్నాడన్న నెపముమీదనే ట్రాన్సుఫరు చేసారు. ఇతనేకాదు; ఇంకా చాలామంది ఉద్యోగంలో వుండగా ఇల్లు కట్టుకుంటే వారికికూడా బదిలీ అయింది. అదే మోస్తరుగా నాకూ అయింది. సరే కాని, కాకినాడ నేనొక్కడినే వెళ్లనా, మీరందరూ వస్తారా?" అన్నాడమృతరావు. "నామాటకేమి? విమల నడుగు; అది ఏమంటుందో" అని తన ప్రక్కనున్న గుమ్మంలో నుంచుని తల్లికొడుకుల సంభాషణ వినుచున్న కోడలినిచూచి "పిల్లా, మన్నీ తీసుకువెళ్లడమా, లేక ఒక్కణ్ణే వెళ్లనా అంటున్నాడబ్బాయి; నీఅభిప్రాయ మేమిటే?" అంది. "ఏంజెప్పనత్తయ్యా, ఈమాటు బసలాయింపు అయినప్పటినుంచీ నాకేమీ తోచటంలే"దంది విమల. "నాబొమ్మరిల్లూ అవ్వీవిడిచి నేమట్టుకు రాను బాబూ" అంది ప్రేమ. "రేపు మొగుడొచ్చి రమ్మంటే ఈబొమ్మరిల్లూ, ఈసిస్టర్లూ, మదరూ అక్కర్లేకుండా కాకినాడకేకాదు ఎక్కడికి రమ్మంటే అక్కడికి పరుగెత్తా"వంది బామ్మ. "ఏమిటి బామ్మా, ఏమిటి బామ్మా; అసలు నేపెళ్లాడితేగా; పోమ్మా; ఈలాంటి మాటలు మాట్లాడకా" అని చంద్రకాంత పూలుకోసుకోడానికి పరుగెత్తింది ప్రేమ. "నీకష్టసుఖాలాలోచించుకుని ఏదో నీవే నిశ్చయించాలిగాని మేమేం జెప్పగల, మబ్బాయీ" అంది ముసలావిడ. "ఈమాటుకి రామయ్యను తీసుకుని నేనొక్కణ్ణే వెళ్లి అక్కడ ఇల్లూ, వాకిలీ చూచి తర్వాత మిమ్మల్ని తీసుకెడదామని అనుకుంటున్నాను. అప్పటికి పిల్ల పరీక్షలూ అయిపోతాయి. కొత్తయింట్లో కొంతకాలం మీరున్నవారూ అవుతా"రన్నాడు అమృతరావు. "సరే బాగానేవుం"దంది తల్లి. కొత్తఇంట్లో కొంతకాలం వుండొచ్చుగదా అన్న సంతోషంతో, భర్తనివిడిచి ఉండాలిగదా అన్నవిచారంతో మాట్లాడలేకపోయింది విమల. వంటబ్రాహ్మణుడు 'వండైం'దనేవరకూ ఏడుగంట లైనట్టే తెలియలేదు వీరికి. మడిగట్టుకుని అందరూ పడమటింటిలో భోజనమునకు కూచున్నారు. "ఏం రామయ్యా, నువ్వు నాతో కాకినాడకు వస్తావా" అన్నాడమృతరావు. "రాకేంజేస్తాడూ" అంది ముసలామె. "ఏమో అతినిష్టము. మనలా గతను రెక్కలమ్ముకోలేదుగదా" అంది విమల. "తమ శెలవైతే అలాగే వస్తానండి బాబూ" అన్నాడు రామయ్య. "అయితే రెండురోజుల్లో వెళ్ళాలి, సిద్ధంగావుం"డన్నాడు యజమాని. రామయ్య మాట్లాడలేదు. "ఏం రామయ్యా, మాట్లాడ"వనగా 'చిత్త'మంటాడుగాని చెప్పడు. "జీతమెక్కువగావాలెనేమో? అందుకనే ఈనసు"కంది విమల. "మొన్ననేగాదుటోయి, పదిహేనునుండి ఇరవై చేసానూ?" "చిత్తం, చాలాదూరం. పాతికేనా ఇస్తేనేకాని వీలులే"దని ఖచితముగా అన్నాడు వంటబ్రాహ్మణుడు. "నీఅవసరమా నాఅవసరమా అని; ఇదినీకాలం.

ఇరువదిమూడిస్తాను. ప్రయాణమునకుసిద్ధపడు" అన్నాడు అమృతరావు. 'తమచిత్తం', అన్నాడురామయ్య. "ముక్కున్నవారి కందరికీ పడిసెమున్నదే. వంటమనిషి వున్నవారి కందరికీ వున్న అవస్థ ఇది" అంటూ అందరూ లేచారు. తనకు బదిలీగావచ్చిన డిప్టీకలెక్టరు శ్రీనివాసయ్యంగారికి చార్జి వప్పచెప్పి కచ్చేరీవారు చేసిన అంపకపువిందులో సన్మానమంది, సాంఘిక సభలలో ప్రశంసపొందెను. అమృతరావు ఇంటివద్ద సర్దినసామానం తయారూ చూచి "ఎందు కింత సామా" ననగా "బాగుంది; ఏది కావాలంటే ఏమొస్తుంది" మనం పట్టుకెళ్లకపోతే అందిభార్య. ఈదిన మమృతరావుగారిల్లు సందడిగానున్నది. అచ్చన్నపరుపు కట్టుచున్నాడు. రామయ్య సామానుబండిలో వేయించుచున్నాడు. గుమాస్తాలు మొదలగువారు స్టేషనుదాకా వచ్చెదమనుచున్నారు. అమృతరావు తల్లికి నమస్కరించి దీవెనలంది, భార్య అనుజ్ఞ పుచ్చుకొని తల్లివద్ద నుంచున్న ప్రేమను ముద్దుపెట్టుకుని "ఉత్తరంరాస్తావా ప్రేమా" అనేటప్పటికి ఏడ్వ మొదలుపెట్టింది. "ఏడవకమ్మా, ఇదిగో" ఈపదిరూపాయలూ పుచ్చుకుని మేనక్జీ షాపులో ఆవేళ చూసిన పెద్దసెలులాయడు బొమ్మకొనుక్కో, పిచ్చిపిల్లా; ఇందా, వుత్తరం రాయేం" అన్నాడుతండ్రి. తానుఇదివరలో అడిగిన పెద్ద బొమ్మకొనుక్కోమని ఇచ్చిన పదిరూపాయలు చూచుకుని సంతోషిస్తూ "మీఅడ్రస్సేమిటి" అంది కళ్లుతుడుచుకుంటూ. "రభాద్వాజుల అమృతరావుగారు,

ట్రెజరీ డిప్టీ కలెక్టరు,

కాకినాడ (గోదావరిజిల్లా).

అనివ్రాస్తే సరి" అంటూ బండెక్కాడు అమృతరావు. అందరూ స్టేషన్‌దాకా వెళ్లి బండి కదిలేవరకూ వుండి సెలవు పుచ్చుకుని ఎవరియిండ్లకు వారు వెళ్లారు. అమృతరావూ, రామయ్యా చామర్లకోటలో దిగి కాకినాడ బండి ఎక్కి కాకినాడ స్టేషనులో దిగేటప్పటికి డవాలీ బంట్రౌతులూ, ముఖ్యమయిన కచ్చేరీ వుద్యోగులూ ఎదుర్కొని రామారావు పేటలో నున్న చింతలపూడి అచ్యుతరామయ్యగా రింటికి తీసుకువెళ్లి వారిని వీరికీ, వీరిని వారికీ ఎరుకపఱచి కొంతసేపు ప్రయాణమునుగురించి, చార్జి పుచ్చుకోవడమునుగురించి మాట్లాడి కచ్చేరికి వెళ్లవలసినవారుగాన క్రొత్త డిప్టీకలెక్టరుగారి వద్దను, అచ్యుతరామయ్యగారివద్దను సెలవు పుచ్చుకుని వారివారి గృహములకు వెళ్లిరి. అచ్యుతరామయ్యగారి వడ్డిమంగలి బాలాజీ "స్నానానికి నీళ్లు తోడానండి బాబూ" అని చెప్పగా అచ్యుతరామయ్యగారు దేశపరిస్థితులను మాటలాడుట చాలించి "తమరు స్నానం చెయ్యం డమృతరావుగారూ, ప్రయాణపు బడలిక తీర్చుకున్నాక సావకాశంగా మాట్లాడుదా" మనగా అమృతరావు రామయ్య ఇచ్చినపంచె, తువ్వాలూ పుచ్చుకుని బాలాజీ దారి చూపగా స్నానాలగదిలోకి వెళ్లి స్నానాది అవశిష్టములు తీర్చుకుని వచ్చాడు. "మడి గట్టుకోవచ్చు"నని పిలుపు రాగా పోయి వడమటింటిలో భోజనముచేస్తూ బెజవాడనుగురించి అచ్యుతరామయ్యా, కాకినాడనుగురించి అమృతరావూ ఆంధ్రవిశ్వవిద్యాలయ కార్యస్థానము గురించి వుభయులూ మాట్లాడుకుంటూ భుజించి లేచారు. బాలాజీ తాంబూలము తయారుచేసి ఇచ్చి 'పక్కలు పరిచా'నని చెప్పగా "అయ్యా తమరు కాస్సేపు విశ్రమించండి. చాలాబడలివుంటా"రన్నా డచ్యుతరామయ్య "చిత్తం, దానికేమి లెం"డంటూ విశ్రమించా డమృతరావు. మధ్యాహ్నము కాఫీ ఫలహారం పుచ్చుకుని కాస్త తిరిగివద్దామా" అన్నాడు అమృతరావు. 'పదం'డంటూ అచ్యుతరామయ్యా అమృతరావూ కలిసి షికారువెళ్లివచ్చారు. రాత్రిభోజనములవేళ అమృతరావు ఆరువేలనియోగియనీ, ఇంటి పేరు భారద్వాజులవారనీ తెలుసుకుని తమ యిరువురకూగల దూరపు బంధుత్వము మూడుమాటల్లోదగ్గరకి తెచ్చాడచ్యుతరామయ్య. "అవును; మాఅమ్మ చెపుతూ వుంటుంది. చింతలపూడివారు మనకు బంధువులని ఏం తెలుస్తుంది దూరానవుంటే" అన్నాడు అమృతరావు. మరుసటిదినము గుమాస్తాకి కబురుపంపి "మన బంగాళాలో ఏదేనా ఖాళీవుందా క్రిష్ణయ్యా; కొత్తగా వచ్చిన డిప్టీకలెక్టరుగారికి కావాలీ" అనిఅచ్యుతరామయ్య అడుగగా గుమాస్తా చిత్తం మనదక్షిణపు వైపు బంగాళాఖాళీగానే వుందన్నాడు. అమృతరావా ఇంట్లోదిగి ట్రెజరీడిప్టీకలెక్టరు రంగయ్యనాయడుగారి

నుండి ఛార్జి పుచ్చుకుని క్రొత్తస్నేహితులతో, క్రొత్తబంధువులతో పాతకాపైనాడు.

చింతలపూడివారంటే లక్షాధికారులని ప్రసిద్ధి. గోదావరిజిల్లాలో వీరి నెరుగని వారే లేరు. రామారావుపేటలో నాలుగురోడ్డులకూ ఉన్న పెద్దతోటయూ, నాలుగిళ్ల భవంతీ, మేడా పూర్వోత్తరపు మోస్తరైనప్పటికీ తాతముత్తాతలయాం దుండెడి భక్తిచే అచ్చొచ్చినఇల్లనీ ఆయింట్లోనే ఉన్నాడచ్యుతరామయ్య. సూర్యారావుపేట, రామారావు పేట, పాతకాకినాడ, ఎలివిన్ పేటలలో చాలాబంగాళాలు కలవు. గోదావరిజిల్లా అన్నిప్రాంతములలోనూ చింతలపూడివారి భూములే. తోటలు సరేసరి. తరాలనాటి భాగ్యము. అచ్యుతరామయ్య మహోయుక్తిపరుడు. సొమ్ము అనవసరముగా పాడుచేయక తనకూ, తనకుటుంబమువారికీ గౌరవప్రఖ్యాతులకై ఎంతైనా పాటుపడువాడు; ఈవిషయంలో ఎంతైనా వ్యయంచేసేవాడు. మంచి మాటకారి. సాధారణంగా అందరూ అయ్యే చనకబియ్యే ప్యాసైనాడు. స్నేహపాత్రుడు. తెలున్నవాడు. ఎవరు క్రొత్తగావచ్చినా ముందు అచ్యుతరామయ్యగారి అతిథులౌటయూ, ఆయనచెలిమి కోరుటయూ, వెళ్లేటప్పు డాయనచేయువిందు లారగించి సన్మానము పొంది వెళ్లుటయూ వాడుక. అందుచేతనే మన అమృతరావుకూడా వీరింటి అతిథి అయ్యెను. ఇదిగాక బంధుత్వము కలిసినవాడౌటచేతను, స్నేహాభిలాషి గనుకను, ఒంటరిగా వుండుటచేతను పండుగపుణ్యములందే కాక శనివారాదివారములుకూడా అమృతరావచ్యుతరామయ్యగారింటనే భోంచేయుచూ కులాసాగా వుంటున్నాడు. అచ్యుతరామయ్యగారి భార్య విజయనగరపు దివాంజీగారగు కసింకోట జోగారావుగారి కొమార్తె. ఆమె అత్తవారింటికి వచ్చేటప్పుడు ఓవడ్డిమంగలినౌకరునీ, ఓదాసీదాన్నీ, తలదువ్వుట మొదలగుపనుల కొక బ్రాహ్మణవితంతువునీ పుట్టింటివారు అరణమిచ్చారు. చిట్టెమ్మ అందమైనమనిషే. ఆమె ముస్తాబంతా తూర్పుపద్ధతి. మిక్కిలి భోగాభిలాషి. ఎప్పుడూ చేయనిశ్రృంగారం మాయనిమడతాను. దాసీది నీళ్లుపోయుట, రమణమ్మ జడవేయుట, బాలాజీవేసినతివాశీపై ఠీవిగా వంటైందనేవరకూ కూర్చుండుట ఇవియే ఆమె నిత్యకృత్యములు. చిట్టెమ్మ నాలుగుదేశపునగలూ గంగిరెద్దువలె అలంకరించుకొనును. ఆమె కాపసిమిలోహము, భారమెట్లులేదో? పనిపాటలు చేయనక్కరలేదు సరికదా ఈఏటా ఆఏటా పిల్లలేమో అంటే. వరప్రసాదిలాగ మోహను డొక్కడే కుమారుడు. ఆతనికిప్పుడు ఇరువయిఏండ్లు. యం. బి., బి. యస్. డాక్టరీకి చెన్నపట్నం విక్టోరియా హాస్టలులో వుండి చదువుచున్నాడు. 'వూళ్లో అమ్మలక్కలంతా చింతలపూడి చిట్టెమ్మగారికెంత షోకమ్మ, అనుకునేవారు. ఆమెకు షోకుకాకేమి!' కలిగినపుట్టిల్లూ లక్షాధికారులు అత్తవారూనూ.

ఒకరోజున "పిల్లడిపెళ్లిమాటేమినిశ్చయించా" రందిచిట్టెమ్మ. "ఇంకనూ ఏమీ నిశ్చయించలేదు. మోహనుడు వస్తాడుగా వాడేమంటాడో చూదా"మన్నాడచ్యుతరామయ్య.

చి—వాడిమొహం వాడి కేమిటి తెలుస్తుంది. మనమే ఏదో స్థిరపరిచేసెయ్యాలిగాని. అ— చాలా సంబంధాలున్నాయి గాని మన అమృతరావుగారికొక కుమార్తె వుందిట; ఆపిల్లనిస్తే బాగుండును.

చి—ఆయనతనకూతుర్ని చేసుకోమంటున్నాడా ఏమిటి? పిల్లనిచూడకుండా, ఎందరుపిల్లలో, ఏమిటో తెలియకుండా అమృతరావునిచూసి పిల్లను చేసుకోవాలంటారా ఏమిటి?

అ—కాదేఅతని కొక్కతె కూతురుట; పిల్లకి పదిసంవత్సరాలు. వీరితండ్రిగారి ఊరు గుడివాడ; తండ్రి యాస్తి దాయాదులు కలుపుకున్నారు. అమృతరావు తల్లివంక సాలుకు రెండువేలు వచ్చేభూములూ, . వల్లూరులో ఇల్లూను. ఇదిగాక బెజవాడలో పాతిక ముప్పైవేలు చేసే ఇల్లు మొన్ననే కట్టేడుట. ఇతనేమో డిప్టీకలెక్టరు చేస్తున్నాడుగదా. ఇంకా సంపాదిస్తాడు. పిల్ల తండ్రిపోలిక. బాగానే ఉంటుందిట. ఈయావత్తు ఆస్తికీ ఆపిల్లే అధికారురాలవుతుంది. మన అబ్బాయికి చేసుకుంటే ఆ యాస్తి మనకు కలుస్తుంది.

చి—సరి బాగుంది; మీకు ఆస్తిలావుగా లేదు. వాళ్ల ఆస్తికి ఆసించడానికి మనకే పదిమందు

న్నారు?. మోహను డొక్కడేగా నలుసు లాగ. వాడి కీలక్షురూపాయ లాస్తి ఎక్కితొక్కిని.

అ—ఎన్ని ఏళ్లయినా నీలావు నీవుమానలే దే.

చి—బాగుంది ఎప్పుడూ వేళాకోళమే కాని పిల్లడిపరీక్ష లెప్పుడూ? ఇక్కడికెప్పుడువస్తాడు.

అ—వచ్చేనెల్లో వస్తాడు.

"ఈ సెలవులో పిల్లడిపెళ్లి చేసేయాలంది"-చిట్టెమ్మ. "సంబంధం కుదిరితేనాఅడ్డు లే"దన్నాడచ్యుతరామయ్య.

అమృతరావు కాకినాడకి వచ్చి ఆరుమాసము లైంది. ఇక్కడి పరిస్థితులూ, అచ్యుతరామయ్యగారి స్నేహమూ వారి ఆస్తీ, ఏకపుత్రత్వమూ, లెక్కింప శక్యముగాని వెండి బంగారములూ, దివాణములాగ పరిచారికాగణమూ చూచి అతనిలో కొంతమార్పు ఏర్పడి దినదినాభివృద్ధి అవుతూంది. పిల్ల పెండ్లిచేయుటయా లేక అవివాహితగా నుండుటయా అని ఆలోచించాడు. వివాహము చేసినట్లయితే తన ప్రతిజ్ఞకు భంగమని. లోకులుకాకులవంటివారు పొడుచుకు తింటారు. ఊరివారికి భయపడి అన్ని విధాలా అనుకూలమైన సంబంధం వదులుకుంటే మళ్లీ ఇట్లాంటి సంబంధం దొరకదు. 'కాళ్లముందరిబేరం కాశీవెళ్లినా దొరక'దందురు. ఇదిగాక 'అమ్మ అస్తమానమూ, ప్రేమపెళ్లి చూడాలని వుందిరా' అంటూవుంటుంది. ఆమె పెద్దదైంది. ఏమైనా తీర్చగలంగాని మాతృఋణము తీర్పలేము. అమ్మకోరినట్లు ప్రేమపెండ్లిచేసి ఆమె ఋణమునుమాత్రము తీర్చుకుంటాను. ఎవరేనా అడిగితే 'ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికామాటలాడి' అని సుమతిచెప్పినట్లుగా అప్పటి కేదో తగినట్లు చెప్పేదను. ఒకవేళ ఏదేనా అబద్ధమాడినా "వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణవిత్తమానభంగమందు రజితగోకులాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు నఘముపొందదధిప!" అని శుక్రాచార్యుడు చెప్పనే చెప్పాడు గనుక ఏదేనా అబద్ధమాడినా వివాహవిషయం గనుక తప్పులేదు." అని ఈవిధంగా తర్కవితర్కాలు చేసి సమాధానపరుచుకుని పిల్లకు పెండ్లి చేయుటకు నిశ్చయించుకున్నాడు. అప్పటినుండీ చింతలపూడివారి సంబంధముకై ప్రయత్నించి అచ్యుతరామయ్యగారికి అయిదువేలువరకట్నం కావాలని తెలుసుకుని, ఆయన తనకు మిక్కిలి స్నేహితుడూ, బంధువూ గనుక పరస్పరంగా మాట్లాడితే ఏ రెండువేలకో వప్పుకుంటా డనుకున్నాడు. కాని 'ఎక్కడేనా బావా అనుగాని వంగతోటలో మట్టుకు బావా' అన్నట్లు సొమ్ములో - తనికెంతమాత్రమూ మొగమోటము లేదని అమృతరా వెరుగడు. మధ్యవర్తులద్వారా కొంతబేరము జరుపుతూనే వున్నాడు. దాసీది వచ్చి "అమ్మగోరూ, ఈయాల అబ్బాయిగో రొత్తారంటగా దండీ"అని పొంగి పోతూ అడిగింది. "అవు నే మైలుబండికి రావాలి." "సిట్టిబాబిప్పు డెంతపెద్దోరైనా నాసేతుల్లో పెరిగాడాబాబు. నాకత్తమానం సూడాలనుంటుంది. బేగెల్లి పనిచేసుకొత్తా"నంటూ వెళ్లింది అప్పి. ఈలాగే అందరూవచ్చి అడుగుతూంటే, అవునని రోజూకంటే త్వరగా ముస్తాబై తివాసీమీద కూర్చుని కొమారునికై ఎదురు చూస్తూంది చిట్టెమ్మ.

మెయిలు సూర్యారావుపేటలో ఆగింది. సెకండుక్లాసుబండిలో నుండి కళ్లజోడూ క్రాపుతలా, సిల్కుసూటూ ధరించిన ఇరువదిఏండ్ల యువకుడుదిగెను. "అడుగో అబ్బా"యంటూ అచ్యుతరామయ్యగారు ముందుకు నడువగా అమృతరావూ, కృష్ణయ్యా మొదలగువారాయన ననుసరించారు. మోహనుడు తండ్రికి నమస్కరించాడు. "ఈయన కొత్తగావచ్చిన డిప్టీకలెక్టరుగారు. మనకు బంధువులుకూడా" నంటూ అమృతరావుని ఎరుకకపర్చగా అమృతరావు మోహనులొండొరులు కరచాలనముచేసి కుశలప్రశ్నలు వేసుకున్నాక అందరూ పట్నంలోని విశేషాలూ, మెడికలకాలేజీనిగురించి, కొశ్చను పేపర్లనుగురించి మాట్లాడుతూ ఇంటికి వచ్చారు. తను వ్రాసిన ఆన్సర్లనుబట్టి మొదటివాడుగా పేసౌతానని తోటివిద్యార్థు లన్నారుగాని రెండవవాడుగా కావచ్చునంటూ, తనకై ఎదురుచూచుచున్న తల్లి వద్ద కతిచురుకుగానడిచాడు మోహనుడు. ఆనాడు మూడవపెళనివార మాటచే కాబోయే అల్లుని పంక్తిని భోంచేసి వారింటనే విశ్రమించా డమృతరావు.

చిట్టెమ్మా, అచ్యుతరామయ్యా కొమారునితో మాటవరసని ఎండాకాలపు సెలవులలో వివాహము చేయదలచితిమనియూ, అమృతరావుగారి విషయములో తామెరిగిన సంగతులూ చెప్పి ఆయనకొమార్తెను స్వీకరించెదమని చెప్పగా, తనమనస్సులో మంచి చదువుకున్న చక్కనిపిల్లని పెండ్లాడాలని వున్నప్పటికీ ఆమాటచెప్పక "అప్పుడే ఏంతొందర నాన్నగారూ, చదువు పూర్తి అయ్యేదాకా పెండ్లిమాట తలపెట్టకం"డన్నాడు. "అదేమిటి బాబూ, అలాఅంటావు? నీచదువు కాపిల్ల అడ్డు తగులుతుం దనుకున్నావా ఏమిటి? నీచదువంతా అయ్యేదాకా కాపరానికిరాదు లే. పదిపదకొండేండ్ల చిన్నపిల్ల"అంది చిట్టెమ్మ. ఆమాటకిసిగ్గుతో తలవంచుకున్నాడు మోహనుడు. అతనికి తల్లిదండ్రులయెడల మహాభక్తి. తనకుచదువుకున్న పెద్దపిల్లని వివాహమాడవలెనని వున్నప్పటికీ తల్లిదండ్రుల ప్రీతికై తన కయిష్టమైన బాల్యవివాహమున కిష్టపడదలుచుకున్నాడు. మౌనం అర్థాంగీకారమని తల్లితండ్రులు సంతోషించారు.

మామూలుగా అమృతరావు అచ్యుతరామయ్యాగారింట్లో వున్నప్పుడు టపాకూడా అక్కడికే వచ్చును. నేటి టపాలో వచ్చిన ప్రేమవ్రాసిన వుత్తరము తనలో చదువుకొని అచ్యుతరామయ్యాగారి కివ్వగా ఆయన ఈప్రకారం గట్టిగా చదివాడు.

"ప్రియమయిన తండ్రిగారికి

మీవుత్తర మందినది. నాపరీక్షలు అయినవి. సెకండుస్టాండర్డునుండి థర్డుస్టాండర్డుకు మొదటిదానను గా పేసైనాను. నాకుమొదటితరగతి బహుమానము వచ్చినది. మంచి ప్రవర్తనకుగాను రివరెండు మదరు ఇంకొక బహుమానమిచ్చినది. మీరు ఎప్పుడు వచ్చెదరు? అమ్మ, బామ్మ బాగాయున్నారు.

మీ ప్రియపుత్రి

ప్రేమ."

"దస్తూరీ చూడూ ఎంతబాగా వ్రాసిందో"అంటూ తండ్రి ఇవ్వగా మోహను డందుకొని 'మైడియ్యరు పప్పా' మొదలు 'యువరులవ్వింగుడాటరు' వరకూ చూచి చాలా బాగుందని అమృతరావుకి ఇచ్చాడు.

తను అనుకున్నముహూర్తం రమారమీ వచ్చింది. ఇదియే అచ్యుతరామయ్యాకు కావలసినది. చిట్టెమ్మకోరి కపె పిల్ల ఫోటో తెప్పించి చూచారు. నాలుగువేలు వరకట్నమూ, ఆడుపడుచు లేదుగనుక అయిదురోజులూ అయిదువందలూ వియ్యపురాలికీ నిర్ణయించుకుని, వైశాఖమాసములో ముహూర్తంనిశ్చయముచేసుకుని నెల దినములు సెలవుతీసుకుని అమృతరావు బెజవాడ వచ్చాడు. చింతలపూడివారి ఆస్తీ,అల్లుని తెలివితేటలూ, చక్కదనం వర్ణించి తల్లికీ, భార్యకీ చెప్పేడు. మనమరాలు పెళ్లి చూడడం గలిగిందిగదా అని మాణిక్యాంబ అపరిమితానందం పొందింది. కాని విమలకు మట్టుకు కోపం వచ్చింది. "ఇంతవరకూ అతిబాల్యవివాహాలు కూడదని మాకందరికీ నూరిపోసి, సభలలో ఉపన్యాసా లిచ్చి, ఇప్పుడీలా పదిఏళ్లేనా నిండని మనపిల్లకు పెళ్లి కుదుర్చుకువచ్చారు. లోకులేమనుకుంటారూ? అంత మనోనిశ్చయం లేనివారు మొదటనే మెదలకుండా వుంటే ఎవ్వరూ ఏమీ అనరూ లోకంతోపాటేను. అందరూ ఆడవాళ్లు కోరుతూంటే ఆపోకు పడలేక చేశామంటూంటారు.ఇప్పుడు మిమ్మెవ్వరు పోరారని-ఈలాచేశా"రంటూ పెద్దదండకం ప్రారంభించింది. "లోకులమాటకేమి వూరుకుందూ; ఈఅదును తప్పితే ఈలాటిసంబంధ మిక దొరకదు. ఎవ్వరేమనుకున్నా నాకేమీ లక్ష్యములేదు. గాలిదుమారంలాగ చెలరేగి వాళ్లేవూరుకుంటారు." "అయితే అబ్బాయీ, కట్నమేమాత్రము వప్పుకున్నావూ" "నాలుగువేలు. అయిదువందలు వియ్యపురాలికీని," "అబ్బా కట్నం ఎక్కువ. కాని మహోమంచిసంబంధం. లక్షాధికారులు చింతలపూడి వారు. నేచెప్పలే; వారు మనకు బంధువులనీ"అంది, "వరకట్నంకూడా వప్పుకున్నారుగద; ఏవేవి చేయనన్నారో అవన్నీ చేస్తూవున్నా"రంది విమల. అమృతరావుగారి కూతురికి పెళ్లని వూరంతా తెలిసింది. సంస్కారసభలు కూడాయి. అమృతరావు ప్రవర్తనని నిందించారు. సంఘానికి అమర్యాద తెచ్చాడన్నారు. ఈసంఘంలోంచి అతనిని తొలగించినట్టు తీర్మానాలు

చేసి పెద్దవుపన్యాసా లిచ్చి పేపర్లలో వ్యాసాలు వ్రాశారు. సంస్కారనాయకులు. "మనమనుకో లేదండీ, సమయమొస్తే కష్టార్తిపడతాడనీ" అని జనసామాన్య మనుకున్నారు. ఇంకా కడుపుబ్బు తీరని ఒకరిద్దరు అమృతరావుగారినే అడిగారు. "ఇదేమయ్యా" అని "ఏం జెయ్యమంటారూ ఆడవాళ్లు రాత్రీ పగళ్లు రాసుకుతింటూంటే ఎవరుపడగల రిపోరు. స్త్రీలకు అయిష్టకార్యముచేసి వారితో మనం కాపురంచేసి నెగ్గగలమా." అని సమాధానం జెప్పేడు. "అవునులేండి విశ్వామిత్రుడంతటివాడు మేనక మాయల్లో పడిపోయితపస్సే దగ్ధం జేసుకున్నా" డంటూ సమాధానపరుచుకున్నారు. మంచిదినం చూచి పెళ్లిపనులు ప్రారంభించి ముగించారు. బంధువులకీ, స్నేహితులకీ శుభలేఖలు పంపేరు.

నేటిదినము సాయంకాలము నుండియూ, అమృతరావుగారిఇల్లు పచ్చని తోరణములతోనూ, గ్యాసులైట్లులతోనూ, బాజాభజంత్రీలతోనూ, పెక్కువన్నెల చీరలూ, ఆభరణములూ ధరించిన స్త్రీలతోనూ క్రిక్కిరిసి అతి సందడిగా నున్నది. పురుషులు వారికిష్టమగు దుస్తులను ధరించిరి. కొందరు విలువవస్త్రము లున్నప్పటికీ విడనాడి మహాత్మాజీ ప్రసాదమగు ఖద్దరు దుస్తులు ధరించి కళ్లజోడు బాగుగా మెరయునట్లు తుడిచిపెట్టుకుని పెళ్లిపందిరిలో ఆసీనులైరి. పెళ్లిపెద్దలు కొందరు జారిపోవుచున్న వస్త్రమును చక్కజేసి కొనుచూ మహాసందడిగా అటునిటు తిరుగుచుండిరి. కొడుకు నేయించి తెప్పించిన జరీదొండకాయలంచు తెల్లపట్టు పంచె కట్టుకొని అతివోపికగా కట్టపెత్తనం జేస్తున్నది. మాణిక్యాంబగారు ప్రేమ పట్టుచీర గట్టుకుని కళ్యాణంబొట్టు పెట్టుకుని గౌరీతపస్సుకి కూచుంది.. పౌరోహితుడు సత్యనారాయణ కన్యావరణాలు చదువుతున్నాడు. వియ్యంకుడూ, ఆయన మామగారగు కసింకోట జోగారావుగారు ఇంకా వారితరఫు బంధువులు పెళ్లిపీటదగ్గరగా కూర్చున్నారు. వియ్యపురాలూ ఆమెతల్లి మొదలగువారు స్త్రీలసభలో అగ్రస్థాన మలంకరించారు. కన్యాదాతలు పెళ్లికొడుకుతో పీటలమీద కూర్చున్నారు. ముహూర్తసమయం సమీపించినందున పెళ్లికుమార్తెను తీసుకరమ్మని అచ్యుతరామయ్యగారి పౌరోహితుడు తిరుపతయ్య కేకవెయ్యగా పెళ్లికుమార్తె మేనమామ గంపతో ప్రేమను ఎత్తుకువచ్చి దింపాడు. సరిగా యెనిమిది గంటలకు మంగళప్రదమైనట్టియూ వివాహసూచకమైనట్టియూ మంగళసూత్రమును ప్రేమ మెళ్లో గట్టిగా మూడుముళ్లూ వేసి తనసహధర్మచారిణిగా స్వీకరించాడు మోహనుడు. స్థాలీపాకసమయాన్ని తన ఆశతీరా మోయలేనన్ని నగ లలంకరించి భామవేషంలా తయారుచేసింది కోడలిని చిట్టెమ్మ. మనమరాలూ మనమడూ నమస్కరించరాగా పొంగిపోయి తన భూమిలోనుండి అయిదువందలు వచ్చే భూమి రాసి ఇచ్చింది. మాణిక్యాంబ ఇతరు లిచ్చిన కట్నాలతో కానుకలతో చింతలపూడివారి కోడలయింది ప్రేమ.—

లగ్నంతరవాతసదస్యపుసందడియేసందడి. బ్రాహ్మణ్యముపందిరినిండానూవుగింజవేస్తే రాలకుండాహుచున్నారు. సదస్యమంతా అయ్యేటప్పటికి ఆలస్యమౌతుందని పెళ్లివారంతా కాస్త ఎంగిలిపడ్డారు. పెళ్లికూతురికీ పెళ్లికొడుక్కీ కాస్త ఫలహారం పెట్టి సదస్యం ప్రారంభించారు. సదస్యపుతంతు పూర్తిఅయినాక పండితులు వారివారి పాండిత్య సామర్థ్యములు సభవారిఎదుట విశదీకరించారు. అప్పుడు తిరుపతిభట్లు" అయ్యా, అచ్యుతరామయ్యగారూ, తమ రీలా దయచేయండి అగ్రతాంబూలం, పండితతాంబూలాలూ తమరు దగ్గరుండి యిప్పించాలని పిలువగా ఆశీర్వచనంగానిచ్చి పిల్లలిని లేవతీస్తె వాళ్లు కాస్త ఎంగిలిపడతారు. ఇక్కడికే ప్రొద్దుపోయింది. తర్వాత మన ఫలప్రదానాలూ అగ్రతాంబూలాలూ సాయంత్రందాకా ఇవ్వవచ్చు" నన్నాడు. అచ్యుతరామయ్య చిత్తమంటూ సభాతాంబూల మివ్వడానికి పెద్ద లెవరంటే ఎవరని పౌరోహితులు వెతికారు. శేషావధానులుగారు పెద్దలని ఆయనకివ్వబోగా, రామసోమయాజిగారంటూ శేషావధాని వెనుకకుతగ్గాడు. అన్నివిధాలా అర్హతగలవారు మనచంద్రమౌళి శాస్త్రిగారుండగా మాకూ మాకూ ఏమిటంటూ సోమయాజి పలుకగా చంద్రమౌళిగారికి అగ్రతాంబూల మివ్వ స్థిరపర్చారు. 'మీఅందరికంటే పెద్దవాడినా. నాయందు మీకం

దరికీ అల్లా ఆపర ముండబట్టినన్ను పెద్దని చేశా'రంటూ శాస్త్రిగారగ్రతాంబూల మందుకుని జారిపోకుండా గట్టిగా పట్టుకుని వెనుకకు కూర్చున్నాడు. వీరేశలింగం గారికి శైవతాంబూలమూ, తిరువెంగళయ్యంగారికి వైష్ణవతాంబూలమూ, వ్యాసరాయాచారిగారికి మధ్వతాంబూలమూ ఇచ్చి ఆశీర్వచనపన్నా చదివి మంగళహారతి ఇప్పించి వధూవరులను లేవతీశారు. వేళదాటుటచే కాస్త ఎంగిలిపడి ప్రేమ బామ్మవళ్ళో కూర్చుంది. మోహనుడు తాతగారితో ఇష్టాగోష్టిమాట్లాడుతున్నాడు.

అక్కడ పందిట్లో ఇచ్చినఫలప్రదానాల్లో పండూఆకులూ వక్కలేగాని వారికంటికింపైన పైసా లేదు. ఇదేమాయని యొకరిమొగ మొకరు చూచుకుంటున్నారు. తక్కిన పండితోత్తములు తమ టరను ఎప్పుడువచ్చునా, ఎప్పుడు చేతినిండా దొరుకునా, ఎప్పుడు భుజములమీద దుశ్శాలువ పడునా, ఎప్పుడుకుండలములు చెవులకు వ్రేలాడదీయుదురా, ఎప్పుడు చేతులకు సింహతలాటం మురుగులు తొడుగుదురా అనెడి ఆత్రముతో వూపిరి బిగబట్టుకుని కూచున్నారు. పరదేశిబ్రాహ్మణ్యమనిననో వారికి ముందు ఉదరపూజ ప్రథమకర్తవ్యము. తదుపరి ఏమేనా చేతులో పడితే బ్రహ్మానందమే. ఇప్పటికి రెండుఝాములైంది. ఎప్పటికీ సంభావనమాట తెములకుంది. ఎప్పుడు బొజ్జనిండా భుజించెదమాయని పక్వాన్నముల పరిమళములు వచ్చినప్పుడల్లా గుటకలు మింగుతూ వున్నారాబడుగుబ్రాహ్మలు. 'నేనీవూళ్ళో వుద్యోగంగా వున్నప్పుడేనా తలపెట్టానుగా నీపెళ్ళి. ఎవరేనా జబరుదస్తీ చేస్తే బంట్రౌతులచేత ఆపు చేయిస్తును. ఇంతమందిజన మున్నారు. ఏలా ఆపగలడు. ఎలా నెగ్గుకువస్తాడా.' అని సంభావనసమయంలో వియ్యంకుడికి సాయం జేయాలని నడుంగట్టుకున్నారు అమృతరావు, ఆయనభావమరిదీని." చిట్టిబాబు "నువ్వు కాస్త నిమ్మళించూ, మీ నాన్నకి కొంచెం సాయంజేస్తానూ, మీదపడేస్తారీ అపాత్రపుబ్రాహ్మ"లంటూ జోగారావు వచ్చాడు. ఆమాటా నిజమే. చింతలపూడివారంటే ఆంధ్రదేశంలో ఎరుగనివారు లేరు. ఇదిగాక అమృతరావు డిష్ట్రికలెక్టరుగనుక పెద్దసంతర్పణ చేస్తాడు; తృప్తిగా భుజించవచ్చుననీ, అచ్యుతరామయ్యగారనాదినుండీ భాగ్యవంతులుగనుక కరువుదీరా సంభావనిచ్చెదరనీ అపారంగా నచ్చిరి బ్రాహ్మణ్యం. మన అచ్యుతరామయ్యగారు మట్టుకు నదురూ, బెదురూ లేకుండా చీమ కుట్టినంత గాబరాయేనా పడక నుంచొని బ్రాహ్మణోత్తముల నొకపరి కలయచూచి, "అయ్యా, పండితోత్తములారా, బ్రాహ్మణులారా, ఇదివరలో ఎప్పుడైనా మా చింతలపూడి వారివద్ద నుండి సంభావన పొంది సత్కరింపబడ్డవారుంటే దయయుంచి ముందుకు రాగోరెద"నని గంభీరముగా పలికెను. పలుకుటయే తడవుగా నేనంటే నేనని శాలువలవారూ, మురుగులవారూ, కుంపెలాలవారూ, ఇంకా కొందరు పండితులూ వారి అనుచరులూ ఒకరినొకరు త్రోసుకుని ముందు వరుసలో నదరుగా నిలబడి వారు వారు పొందిన బహుమాన విశేషములను ద్విగుణీకరించి వర్ణింపుచుండిరి. అచ్యుతరామయ్యగారు సాంతముగా విని "అయ్యా, బ్రాహ్మణశ్రేష్ఠులారా, మీమీయోగ్యతలనుబట్టి మీగౌరవానుగుణ్యముగా మాపూర్వీకులే మీ అందరికీ తగిన సంభావనలిచ్చి సత్కరించియున్నారు. గాన ఇప్పుడు వేరే నేనివ్వనవసరము లేద"ని మూడువాక్యములలో వారికి సంభావన ముట్టజెప్పేడు. అందరూ తెల్లపోయి ఏమనుటకూ తోచక ఒకరినొకరు చూచుకుంటూ కొంతసేపటికి సాహసించి 'అచ్యుతరామయ్యగారూ, మీతాతగారు ఇంద్రుడంతవాడు; మహాదానకర్ణుడు. ఆయన దయచేసిన వీదుశ్శాలువలూను,' అని యొకడూ, 'మీతండ్రి చంద్రుడంతవాడు. మీపుట్టుకకిచ్చారు నాకీకుండలా' లంటూ ఇంకొకడూ చెప్పి అటువంటి సంస్థానంలో పుట్టిన మీరు మాత్ర మేమి తక్కువ? తమకుతోచిన తృణమో పణమో దయచేయ, మని మనవిచేసుకున్నారు. ఆముందరివారు అచ్యుతరామయ్యగారి పూర్వీకులచే సంభావన నందినవారుగాన ఇప్పుడియ్యలేదు. మనకున్నదో ఇంతకుపూర్వము పుచ్చుకోని వారము గనుక మనలని బాగాసత్కరిస్తాడని'వుప్పొంగిరి. అందులో కొందరు 'తోటి కూడా మూటాముల్లే ఏమీ లేదేమిరా' 'అంటే ఆపక్కవాడు తెస్తున్నాడేమోరా

అని ఒకరితోనొకరనుకొంటూ సంభావ నందడానికి వీలుగా నుంచున్నారు వెనుకనున్నవారు 'అయ్యో ఎందుకొ స్తిమి ముందరివరుసకు. వెనుకకు దిగడినా బాగుండెడి' దని ముందరి కొచ్చినవారు చింతించుచుండిరి.

ముందుకొచ్చినవారి మనవులు చెవినిపెట్టక వెనుకపంక్తివారి నుద్దేశించి "అయ్యా, ఇప్పటికే చాలా ఆలస్యమయింది; క్షమింపుడు. ఈ యెండలో ఇంతసేపుంచి మిమ్ము విసికించి నందుకు వందన సహస్రములు. మీ రర్హులుగారనియో, మరి యేకారణముచేతనో మీకు సంభావననివ్వ మావారు నిరాకరించిరి. మాపూర్వీకులచే నిరాకరింపబడ్డ వారు మాకున్నూ నిరాకరింప తగ్గవారే. కావన మావల్ల మీకేమి సంభావన ముట్ట"దంటూ కొడుకువద్దరికి చక్కా వెళ్లాడు అచ్యుతరామయ్య. ఇంకేముంది? పందిరంతా గొల్లుమని గందరగోళం బయలుదేరింది. "పెళ్లి కొడుకు తండ్రి ఇంతబాగా సంభావనిచ్చాడు; ఇంక పెళ్లికూతురు తండ్రి చేసే సంతర్పణ ఉందిగా బోలు అదీవుళ్లక్కే తెంపండిరా తోరణాలూ" అంటూతోరణాలపై చెయ్యివేసారాక్షుధార్తులగు పరదేశి బ్రాహ్మణ్యం. ఇంతసేపూ జరుగుతూవున్న సంభావనా చిత్రము చూచుచూ, చిత్ర ప్రతిమవలెనున్న అమృతరావు జోగారావుగారిసామముతో "అయ్యలారా, తోరణములు త్రెంపకండి. నామనవి విని నేచేసెడి సంతర్పణయందు తృప్తిగా భుజించి, నేనిచ్చెడి అల్పసంభావన స్వీకరించి మీరు తృప్తులై నన్ను ధన్యుణ్ణి చేయం"డని చేతులెత్తి ప్రార్థింపగా డబ్బాశ గల పండితులు "చాల్లేవయ్యా చేశావుపెండ్లి-నీపెండ్లీనీవూనూ" అంటూ లేచిపోయారు. అన్నార్తులగు విప్రులందరూ తమాయించి "అయితే కానీ మరి" అన్నారు. తత్‌క్షణం పందిరంతా బాగుచేయించి విస్తళ్లువేసి వడ్డింపించి తనకుతోచినది చెంబులలో వేశాడమృతరావు. తృప్తిగా భోంచేసి బొజ్జలు తడుముకుంటూ 'మా బాగాచేశాడురా సంతర్పణ; పాపంఅమృతరావుగా' రంటూ, త్రేన్చి ఇంతకాలంనుంచి పెండ్లిండ్లకు వెళ్లుతూవున్నాము కాని యీ చింతలపూడి వారిసంభావనంటిది చూడలేదంటూ ఎవరిదారిని వారు వెళ్లా రాబ్రాహ్మలు. అప్పటినుండీ 'చింతలపూడివారి సంభావనలాగుందే' అన్న మాట ఆంధ్రులందరికీ వాడుకపద మైంది.

విదురుఁడు ధర్మజునితో

వేమూరి సీతారామశాస్త్రి గారు

అన్నా! వట్టియమాయకుండవు గదన్నా!, నమ్ము; మాయంధరా
జన్నక్ గోముఖపుండరీక; మతఁడీర్ష్యాయత్తుఁడై యెద్దివా
కొన్నక్ మేలనియే తలంచెద; వనుంగుం దమ్ములన్నిన్ను నేఁ
బన్నం బూన్పఁగ వారణావతముఁ బంపంబూనె నూహించితే?
తెల్లనివెల్లను బాలని - నల్లనివెల్ల జలమనుచు; నమ్మెద వీ వే
కల్లయుఁ గపట మెఱుంగవు - ప్రల్లదుఁ గౌరవుని నేమఱం గాదుసుమా.
ఈయెడ మీరలున్నఁ దమ కింతయుఁ బేరుప్రతిష్ఠ లుండవం;
చేయపకారముం జలుప నే మొకయడ్డుగ నున్నవార మం;
చాయఘరాశి, యాకితవుఁ డాపలుగాకి సుయోధనుండు మీ
కీ యనిమిత్తమాపయన మేర్పఱచెం; బరిణామ మేమొకో!